# లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

- జిల్లా కేంద్రంలో మూతపడ్డ యాదాద్రి డ్రెన్స్ ప్లాంటేషన్
- కార్మిక కుటుంబాల్లో ఆహ్లాదం కోసం గత ప్రభుత్వంలో ఏర్పాటు
- నిర్వహణ లేక ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



గేటుకు తాళం లేక అధ్వానంగా ప్లాంటేషన్


ఎండిపోయిన మొక్కలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 24(నమస్తే తెలంగాణ): సిరిసిల్లలోని కార్మిక కుటుంబాల్లో ఆహ్లాదం కోసం గత ప్రభుత్వం సుందరయ్యనగర్ వద్ద ఏర్పాటు చేసిన యాదాద్రి డెన్స్ ప్లాంటేషన్ కళ తప్పింది. రూ.లక్షలు వెచ్చించి తీరొక్క మొక్కలతో తీర్చిదిద్దిన పార్కును పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ మొక్కలు వాడిపోయి మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యాన్ని 'ఎండ' గడుతుండగా, పట్టని ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.

### ఎండుతున్న మొక్కలు

పల్లెలు, పట్టణాలలోని ప్రజలకు సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని ఇచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కింద పల్లె, పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంలోని కార్మిక కుటుంబాల ఆహ్లాదం కోసం పట్టణంలోని సుందరయ్యనగర్ వద్ద దోభీ ఘాట్ సమీపంలో వరద కాలువను ఆనుకుని రూ.20లక్షలకు పైగా వ్యయంతో యాదాద్రి డెన్స్ ప్లాంటేషన్ పేరుతో పార్కును ఏర్పాటు చేసింది. తీరొక్క మొక్కలు నాటి, పచ్చని గడ్డిని కార్పెట్‌లా పెట్టి తీర్చిదిద్దింది. పచ్చని చెట్లతో, పరుచుకున్న పచ్చదనంతో ప్రజలకు నాడు ఆహ్లాదాన్ని అందించింది. మినీస్టేడియానికి దగ్గర్లో ఉన్న ఈ పార్కులో క్రీడాకారులు సేదతీరేవారు. ఈ డెన్స్‌ప్లాంటేషన్ గత ప్రభుత్వంలో మున్సిపల్ పాలకవర్గం బాధ్యతగా నిర్వహించింది. కానీ కొన్ని నెలలుగా ఆలనా పాలన చూసే వారు లేక అధ్వానంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మూతపడిపోయింది. నాడు ఆకట్టుకున్న ప్లాంటేషన్ నేడు నిర్వహణ లోపంతో ఎడారిగా మారింది. రూ.లక్షలు పెట్టి నాటిన మొక్కలు, పచ్చగడ్డి పూర్తిగా ఎండి పోయింది. డెన్స్‌ప్లాంటేషన్ చుట్టుపక్కల ఎలాంటి నివాసాలు లేక మైదానం ప్రాంతం కావడం, మరోవైపు గేట్లకు తాళాలు లేక మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలాకు అడ్డాగా మారింది. లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్న బల్దియా అధికారులు పార్కుపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ కార్మిక వాడల ప్రజలు నిలదీస్తున్నారు. రూ.లక్షలు ఖర్చుచేసింది వృథాగా వదిలిపెట్టడానికా? పచ్చని గడ్డి, మొక్కలు పశువుల మేత కోసమా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి యాదాద్రి డెన్స్ ప్లాంటేషన్ పార్కుపై శ్రద్ధ చూపి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

## కాంగ్రెస్ స్కీంలు అన్నీ స్కాంలే

- ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హులకు అండగా ఉంటాం
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వ స్కీంలు అన్నీ స్కాంలేనని, అర్హులకు ఏనాడూ న్యాయం చేసింది లేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని, ఇండ్లు రాని నిజమైన లబ్ధిదారులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హులకు న్యాయం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరుతూ పేదల తరఫున ఈ నెల 26న మానకొండూర్‌లో మహాధర్నా చేపడుతున్నామని, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయనే కాంగ్రెస్ సర్కారు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోయిస్తూ, మరోవైపు రైతు భరోసా పేరిట సంబురాలు జరిపిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు పాలన చేతగాక, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నదని ఆగ్రహించారు. ఆ పార్టీ నాయలకు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అనంతరం పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ గొడుగు తిరుపతిని శాలువా కప్పి సన్మానించారు. ఇక్కడ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు చెరుకు రాజిరెడ్డి, నాయకులు కేవియన్ రెడ్డి, నీలం అంజయ్య, అనిల్, కొమురయ్య, రవీందర్, చందన్, సాదుల్, మధు, రఘు, భాస్కర్ ఉన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

కోనరావుపేట, జూన్ 24: కోనరావుపేట మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఉద్యమకారుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంగళ శ్రీనివాస్ నాయకులు

కలెక్టరేట్, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ వెంగళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. సంక్షేమ పథకాలలో 20 శాతం కేటాయించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఒక్కో ఉద్యమ కారుడిని గౌరవించి నెలకు రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు చెప్పారు. ఇక్కడ ఉద్యమ కళాకారుల విభాగం నాయకులు ఎల్ల పోశెట్టి, ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు బొజ్జ కనకయ్య, వెంగళ వెంకటేశం, రాములు, సత్యనారాయణ ఉన్నారు.

## ఎంపీ అర్వింద్ నోరు అదుపులో పెట్టుకో

- ఉద్యమ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ ఆగ్రహం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, జూన్ 24: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నోరు అదుపులో పెట్టుకోవాలని, తన స్థాయికి తగిన మాటలు మాట్లాడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ హితవుపలికారు. ఉద్యమ నాయకులపై ఇష్టానుసారంగా విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను ఉద్దేశిస్తూ ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలతో అతని వ్యక్తిత్వం ఏంటో సమాజానికి తెలిసిపోయిందన్నారు. కేసీఆర్ కుటుంబం కాలిగోటికి కూడా సరిపోని వ్యక్తి వారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. 71ఏండ్ల వయసున్న కేసీఆర్‌ను ముసలివాడు అంటున్న అర్వింద్, మరి 74ఏండ్ల వయసున్న మోదీని ఏమనాలో చెప్పాలని ప్రశ్నించారు. మోదీ వేవ్‌తో ఎంపీగా గెలిచాడని, ఇప్పటివరకు అతని సెగ్మెంట్‌లో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్‌పై కనీస అవగాహనలేకుండా మాట్లాడిన తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవితపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ తీరు మారకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే బొందపెడతారన్నారు. ఇక్కడ ముగ్దం అనీల్‌గౌడ్, కాసర్ల శ్రీనివాస్, ఫిరోజ్‌ఖాన్, వడ్లూరి సాయి, కిరణ్, అజ్జు, తిరమల్, రాకేష్, అక్రమ్ ఉన్నారు.

## డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో ఎస్పీ మహేశ్ బి గితే, సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొంత మంది వస్త్ర పరిశ్రమ కార్మికులు మద్యానికి బానిసై అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇలా జరుగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు, గురుకుల, మోడల్ పాఠశాలలు, వసతి గృహాల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్‌బిగితే మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఠాణాల పరిధిలో విద్యార్థులకు, యువతకు, ప్రజలకు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం డ్రగ్స్ నివారణకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్ ఓ రజిత, డీఏఓ అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్అహ్మద్ ఉన్నారు.

### 'బెస్ట్ అవైలబుల్' ప్రవేశాలలో గిరిజన విద్యార్థులకు అన్యాయం

కలెక్టరేట్, జూన్ 24: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలలో గిరిజన విద్యార్థులకు అన్యాయం జరిగిందని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్ నాయక్ ఆరోపించారు. మంగళవారం లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో గిరిజన విద్యార్థులకు కేటాయించే సీట్లు జిల్లాకు కేవలం 5కే పరిమితం చేశారని, ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. తక్షణమే సీట్ల తగ్గింపును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంవత్సరాల్లో ఉన్న స్థాయిలో సీట్లను కొనసాగించాలని కోరారు. ఇక్కడ లైవ్ టౌన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, తిరుపతి, ప్రకాశ్, రాజ్ పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

ఇల్లంతకుంట రూరల్, జూన్ 24: వెల్జిపూర్ గ్రామానికి చెందిన చుక్క కనుకయ్యకు చెందిన పాడి గేదె వ్యవసాయ భూమిలో పశుగ్రాసం మేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గేదె మృతితో రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, సెస్ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, KAVITA KHINCHI W/o.KISHAN LAL NAVRIYA R/o.Q.No.D-7/25, PTS, NTPC Jyothinagar, Ramagundam mandal, Peddapalli district, TG. I have changed my name from KAVITA NAVRIYA to KAVITA KHINCHI.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## డ్రగ్స్ నివారణపై విస్తృతంగా అవగాహన



వేములవాడ: గురుకుల పాఠశాలలో మొక్క నాటుతున్న ఏఎస్పీ

చందుర్తి/ రుద్రంగి, కోనరావుపేట/ బోయినపల్లి/ ఎల్లారెడ్డిపేట, జూన్ 24: మాదకదవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు రంగంలోకి దిగారు. డగ్స్ వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా కాలేజీలు, పాఠశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు. మంగళవారం చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చందుర్తి సర్కిల్ సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాల కట్టడిపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ ఎస్ఐ జిల్లెల రమేశ్, అధ్యాపకులు ఉన్నారు. అలాగే రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌తో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు ఎస్ఐ మోతిరామ్ అవగాహన కల్పించారు. కోనరావుపేట మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, బోయినపల్లి మండలం కొదురుపాక, నర్సింగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఐ రాజ్ కుమార్, ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ రమాకాంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**జీవితాలను నాశనం చేసుకోవద్దు: వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి**

వేములవాడ, జూన్ 24: తాత్కాలిక ఆనందం కోసం జీవితాలను చేజార్చుకోవద్దని, డ్రగ్స్ పట్ల విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. వేములవాడ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా సంక్షేమ శాఖ, నషా ముక్తా భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం స్కూల్ మైదానంలో మొక్క నాటారు. ఇక్కడ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా మైనార్టీ సంక్షేమ ఇన్‌చార్జి అధికారి భారతి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ రోజా, ప్రిన్సిపాల్స్ రాజయ్య, కుమార స్వామి ఉన్నారు.

## వీడిన బాలుడి మిస్సింగ్ మిస్టరీ

- తాజొద్దీన్‌ను తీసుకెళ్లింది అతని నాన్నమ్మే
- సిద్దిపేటలో బాలుడిని గుర్తించిన పోలీసులు


ఎల్లారెడ్డిపేట ఠాణాలో బాలుడితో పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేటకు చెందిన బాలుడు తాజొద్దీన్(8) మిస్సింగ్ మిస్టరీ వీడింది. 24 గంటల్లోనే పోలీసులు కేసును చేధించారు. సిద్దిపేటలో ఉంటున్న అతని నాన్నమ్మే బాలుడిని తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్లకు చెందిన అజీమొద్దీన్ –అబేదా దంపతులు. వీరికి కొడుకు షాదుల్ ఉండగా, అతని చిన్న తనంలో అజీమొద్దీన్ –అబేదా విడిపోయారు. అయితే షాదుల్ పెరిగి పెద్దయ్యాక జరీనాను వివాహం చేసుకోగా, వారికి కొడుకు తాజొద్దీన్(8) జన్మించాడు. అయితే మూడేండ్ల క్రితం కరోనాతో తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో తాజొద్దీన్ ఒంటరైపోయాడు. ఈ క్రమంలో తాజొద్దీన్ పెంపకం బాధ్యతలను అతని పెద్దమ్మ జకియా (జరీనా సోదరి) తీసుకున్నది. బాలుడు కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. అయితే జకియా ఇటీవల పెండ్లి చేసుకోగా, ఎక్కడ తన మనుమడు అన్యాయమైపోతాడోనని నానమ్మ అబేదా భావించింది. సోమవారం కిషన్‌దాస్‌పేటకు వెళ్లి స్కూల్‌కు ముగిసిన వెంటనే బాలుడిని తనతో తీసుకొని వెళ్లడం, జకియా ఫిర్యాదుతో రంగంలోకి ఆచూకీ గుర్తించినట్లు తెలిపారు. బాలుడు తాజొద్దీన్‌ను, అతని నానమ్మ అబేదాను సిద్దిపేట నుంచి స్టేషన్‌కు తీసుకువచ్చారు. కాగా, తాజొద్దీన్‌ను నాలుగేండ్లుగా పెంచుకుంటున్న పెద్దమ్మ జకియాకు ఇవ్వాలా..? బాలుడి రక్షణ కోసం పరితపించే నానమ్మ అబేదాకు ఇవ్వాలా.. అనే విషయంపై పోలీసులకు సందిగ్ధం ఏర్పడడంతో జిల్లా అధికారుల సూచనల మేరకు ప్రస్తుతానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఇద్దరిలో బాలుడిని పోషించగలిగే ఆర్థిక పరిస్థితి, బాలుడి రక్షణ స్థితి ఆధారంగా ఎవరికి అప్పగించాలనేది లీగల్ ఒపీనియన్ తర్వాత తేలుతుందని సీఐ వివరించారు.

### నిబంధనల ప్రకారం పనులు చేయాలి

సిరిసిల్ల రూరల్,జూన్ 24: ఈజీఎస్ పనుల్లో నిబంధనలను అనుగుణంగా పనులు నిర్వహించాలని డీఆర్‌డీవో పీడీ శేషాద్రి సూచించారు. మండలంలో 2024–25 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ–ప్రజా వేదికను మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. పనులకు సంబంధించి రూ.21,886 రికవరీ చేయాలని, రూ.24వేలు పెనాల్టీ వేసినట్లు చెప్పారు. ఇక్కడ విజిలెన్స్ అధికారి రామారావు, జెక్యూ నవీన్, ఎంపీడీవో లక్ష్మీనారయణ, రమేశ్, ఎంపీవో బేగ్, ఈజీఎస్ ఏపీవో నాగరాజు, ఈజీఎస్ టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, జూన్ 24: 'టెంజింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు'ల కోసం జిల్లాలో 2022, 2023, 2024లో సాహస కృత్యాలు చేసిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీర రాందాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహస రంగంలో పాల్గొన్న వ్యక్తుల విజయాలను గుర్తించడానికి యువజన వ్యవహారాల శాఖ ఈ జాతీయ అవార్డు'లను ఇస్తున్నదని, 2024 సంవత్సరానికిగాను ఆన్‌లైన్‌లో పోర్టల్ (https://awards.gov.in/) ద్వారా ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### జిల్లాలో 1.24లక్షల మందికి రైతు భరోసా

కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలో రైతు భరోసా పథకం కింద 1,24,292 మంది రైతులకు రూ.145 కోట్లకు పైగా డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు.

### బీఆర్ఎస్ నేతల పరామర్శ


పల్లిమక్తలో శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు

కోనరావుపేట, జూన్ 24: పల్లిమక్త గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త జిన్న శ్రీకాంత్ మోకాలి చికిత్స చేయించుకోగా, అతన్ని బీఆర్ఎస్ నేతలు మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, సీనియర్ నేతలు న్యాలకొండ రాఘవరెడ్డి, జిన్న అనిల్, మల్లేశం, బాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వేములవాడ, జూన్ 24: యోగ డేను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని వివేకానంద జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం మై భారత్, ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మంద రాజేందర్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు వికాస్ గౌడ్, మై భారత్ మాజీ వలంటీర్ గంగిపల్లి స్వామి కుమార్, కళాశాల అధ్యాపకులు నరేశ్, నజీర్, మునీష్, వినయ్ ఉన్నారు.

### వివాహిత ఆత్మహత్య

వేములవాడ, జూన్ 24: 'నా చావుకు ఎవరూ బాధ్యులు కారు. నన్ను క్షమించండి' అంటూ ఓ వివాహిత సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడలో జరిగింది. వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో గంప ప్రసాద్, గంప మంజుల (58) దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు ఉండగా, వివాహాలు జరిగాయి. కొడుకులు వృత్తిరీత్యా ఒకరు కరీంనగర్, మరొకరు హైదరాబాద్‌లో ఉంటుండగా వీరు వేములవాడలో ఉంటున్నారని స్థానికులు తెలిపారు. అయితే మంజుల సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

### బొప్పాపూర్ పాఠశాలలో డీఈవో

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో వినోద్‌కుమార్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, వంటగది అవసరంపై వివరించారు. త్వరలోనే అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని చెప్పారు. శివాలయం వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పెచ్చులూడుతున్న తరగతి గదిని పరిశీలించి విద్యార్థులకు సమస్య లేకుండా చూస్తామని ప్రధానోపాధ్యాయులు సదియాతో తెలిపారు. మొదటిసారి ఉన్నత పాఠశాలకు వచ్చిన డీఈవో వినోద్‌కుమార్‌ను జడ్పీ స్కూల్ హెచ్ఎం మధుమాలతి, ఉపాధ్యాయులు సన్మానించారు.

### విధుల్లోకి తీసుకోవాల్సిందే

- దుమాల ఈఎంఆర్ఎస్ ఎదుట ఇటీవల తొలగించిన బాధిత సిబ్బంది ఆందోళన


స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దుమాల ఈఎంఆర్ఎస్ ఎదుట బాధిత టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది మంగళవారం మరోసారి ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ కొద్దిరోజులుగా తాము చేస్తున్న నిరసనలతో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్ స్పందించి తాము పాఠశాలకు వస్తే మాట్లాడతానని చెప్పారన్నారు. కానీ తాము స్కూల్ వచ్చి రోజంతా ఎదురు చూసినా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాలేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. తమను విధుల్లోకి తీసుకునే వరకు పాఠశాల ముందే కూర్చుని శాంతియుత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ టీచింగ్ స్టాఫ్ శ్రీనివాస్, అశోక్, జగన్, నాన్‌టీచింగ్ స్టాఫ్ నిర్మల, సుజాత, బాలు ఉన్నారు.

### ప్రైవేట్ స్కూల్ వ్యాన్ అడ్డగింత

కోనరావుపేట, జూన్ 24: వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తరలిస్తున్న వాహనాన్ని సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు గోపు పర్శరాములు, పలువురు గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పర్శరాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికే పంపించాలని కోరారు.

### వర్షాలు కురవాలని పూజలు

రుద్రంగి, జూన్ 24: వర్షాలు కురవాలని అడ్డాబోర్‌తండా గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం రుద్రంగి గ్రామశివారులోని నీలగండి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగాపండాలని స్వామివారిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు చెప్పారు. హోమం నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

### విద్యార్థులకు సత్కారం

బోయినపల్లి రూరల్, జూన్ 24: నర్సింగాపూర్ జడ్పీ పాఠశాలలో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు ఎస్. నందిని, ఆర్ అభినవిలను చంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమానికి బోయినపల్లి ఎస్ఐ రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని చెప్పారు. ఎంఈవో ఎన్ శ్రావణ్ కుమార్ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను సర్కారు బడికే పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఇక్కడ చంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ బాధ్యులు సీ రామరాజు, డీ శ్రీహరి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.